# పులి-పిల్లి

నక్షత్రాల మిలమిల తప్ప చంద్రుడెక్కడున్నాడో కనపడడం లేదు. నిశ్శబ్దాన్ని భంగపరుస్తూ, సముద్రహోరుకి చలిగాలి వంత పాడుతోంది. తప్పనిసరిగా బైటికి వెళ్ళేవారిని సహితం ముడుచుకుని పరిగెత్తేలా చేస్తోందా వాతావరణం. చీకటిపడగానే తలుపులు బిడాయించుకుని నిద్రపోతోందా వూరు.

అలాంటి వాతావరణంలో స్వప్న గబగబా నడుచుకుంటూ వెడుతోంది. అంత చలిగాలిలోనూ ఆలోచనలతో నిండిన ఆమె శరీరమంతా చమటతో తడిసిపోతోంది. ఆలోచన వేగం నడక వేగాన్ని అధిగమించి పరుగెడుతోంది. రాత్రి పది దాటి వుంటుంది. సముద్రపు ఒడ్డునే నడుచుకుంటూ వెళ్తున్న స్వప్న బీచి దాటి కొంచెం ముందుకి వెళ్ళగానే ఓ రాతి పక్కగా రెండు ఆకారాలు కనపడి ఒక్కసారిగా ఆగిపోయింది. రాతి గుట్ట వెనక నిలబడి దూరానవున్న వారిని చూసింది. అవి ఆడా, మగా ఆకారాలు. బీచ్‌లోనే జనం వుండని ఇంత రాత్రి ఈ చలిలో ఎవరయి వుంటారు? ప్రేమికుల జంటో, కొత్త దంపతులో అయి వుంటారనుకుంటూ మళ్ళీ ఏదో గుర్తొచ్చి తనని వాళ్ళెక్కడ చూస్తారో అనుకుని అక్కడున్న వాళ్ళకి కనపడకుండా పక్కకి జరిగి నక్కి కూర్చుంది. భారంగా ఊపిరి పీల్చుకుని అలసటగా రాతి గుట్టకి అనుకుని నిలబడింది.

పావు గంట గడిచింది నెమ్మదిగా తలెత్తి చూసింది. ఇంకా ఆ రెండు మానవాకారాలు అక్కడే వుండడంతో స్వప్నకి ఒక్కసారిగా దుఃఖం సముద్రపు కెరటంలా గుండెల్లోంచి తన్నుకొచ్చింది.

“హే భగవాన్ నన్ను చావను కూడా చావనివ్వవా? ఏం పాపం చేశానని నన్నింతలా హింసిస్తున్నావు? ఈ రంపపు కోత బ్రతుకు భరించలేక విముక్తి పొందాలని తెగించి ఇల్లు దాటి బైటికొస్తే నాకు వీళ్ళిద్దర్ని అడ్డుగా తగిల్చావా? దేముడా! అసలు నువ్వున్నావా? వుంటే ఎక్కడున్నావు?” అని మనసులోనే రోదిస్తున్న స్వప్నకి అక్కడున్న ఆడగొంతు గట్టిగా వినపడడంతో దుఃఖాన్ని మర్చిపోయి ఆమె మాటల్ని వినడమే కాకుండా నెమ్మదిగా వంగి వారినే చూడసాగింది. ఆ స్త్రీ గట్టిగానే అరుస్తూ అతన్ని దూషిస్తోంది. అతను ఆమె కేకల్ని పట్టించుకోకుండా ఆమె గడ్డం పట్టుకుని చంపల్ని నిమురుతూ బ్రతిమాలుతున్నట్లు ఆ చీకటిలో అతని చర్యలవల్ల తెలుస్తోంది. అయినా ఆమె శాంతించకుండా ఇంకా గట్టి గట్టిగా అరుస్తూనే వుంది. దాంతో అతను గెడ్డం వదిలి ఆమె చేతులు పట్టుకుని గుండెలకి హత్తుకుని ప్రాధేయపడుతున్నట్లు తలూపుతున్నాడు. ఆమె ఏ మాత్రం దయాదాక్షిణ్యాలు

చూపకుండా చేతులు విదిల్చి కొట్టి చరచరా వెళ్ళిపోసాగింది. అతను ఒక్కసారిగా ఆమె ఎదుటికి పరుగెత్తుకుంటూ వెళ్ళి ఆమె రెండు కాళ్ళూ చుట్టేసి తల ఆన్చి ఆమెని కదలనివ్వకుండా చేసి ఏదో నెమ్మదిగా బ్రతిమాలుతున్నాడు. ఆమె రెండు కాళ్ళూ అతని చేతుల్లోంచి విడిపించుకునే ప్రయత్నం చేస్తున్న కొద్దీ అతను ఆమె కాళ్ళని కదలనివ్వకుండా మరింత గట్టిగా పట్టుకుని చుట్టేస్తున్నాడు. దాంతో ఆమె గొంతు మరింత హెచ్చించి అరవసాగింది.

ఈ దృశ్యాన్ని తిలకిస్తున్న స్వప్న తనొచ్చిన పనిని మర్చిపోయి పిచ్చిదానిలా వాళ్ళనే చూడసాగింది. అలా చూస్తున్న స్వప్న ఒక్కసారిగా తన భర్తకీ ఆ వ్యక్తికీ మధ్య వ్యత్యాసాన్ని కొలిచి చూసుకుంది. మగవారిలో అంత సాత్వికులు, శాంత స్వభావులు వుంటారని తొలిసారి తెలుసుకుంది. జీవితం ఎంత చిత్రమయినది! అంత సాత్వికుడికి, అలాంటి గయ్యాళి స్త్రీని జతగా కూర్చాడేమిటి? నిజంగా నాకే అలాంటి నెమ్మదైన వ్యక్తి భర్తగా దొరికి వుంటే జీవితమంతా అతని కాళ్ళు కడుగుతూ బ్రతికేదాన్ని. నా జీవితం ఎంత హేయమైనది. అసలు ఈ రోజు ఈ అఘాయిత్యం తల పెట్టడానికి కారణం ఏమిటి?

నాలుగేళ్ళ తన వైవాహిక జీవితంలో భరత్ ఎంత నరకాన్ని రుచి చూపించాడు. ఒక్క రోజన్నా ఆప్యాయంగా పలకరించాడా? ఇంట్లో వున్నంతసేపూ ఏవో తప్పులెంచి అగ్ని హోత్రుడిలా మండిపడటమే తప్ప తనతో సరదాగా ఒక్క మాట మాట్లాడాడా? ఆ మనిషిలో ఎప్పుడూ కోపాన్నే తప్ప శాంతిన్ని, నవ్వుని చూడని స్వప్న అందరూ భర్తలూ అలాగే వుంటారనుకునేది. తాగి వచ్చినా, పేకాడి వచ్చినా ఎదురు చెప్పకూడదు. ఎదిరించి అడిగిన రోజు వళ్ళంతా కముకు దెబ్బలు. వాతలతో నిండిపోయేది. తన వంటి మీద నగలు, ఇంట్లో విలువైన సామాన్లు అన్నీ బజారు పాలయ్యాయి. తనూ ఒక మనిషిననీ, తనకీ ఓ మనసుందనీ ఎప్పుడూ ఆలోచించి ప్రవర్తించలేదు. భరత్ ప్రవర్తనకి, హింసించే హింసకి మానసికంగా, శారీరకంగా అలిసిపోయి ఈనాడు సముద్రుడికి జీవితాన్ని అర్పించుకుని విముక్తి పొందాలని ఈ రాత్రివేళ తెగించి బయలుదేరి వచ్చిన స్వప్నకి ఈ జంట కంటపడడంతో తానొచ్చిన పని మర్చిపోయి ఆ పురుషుడిని గురించి పుట్టెడు జాలిపడుతూ ఆ ఇద్దరి మధ్య సఖ్యత చేకూర్చి గొడవలు తగ్గించి సర్దిచెప్పాలన్న ఆలోచన వచ్చి గుట్ట చాటునుంచి లేచి గబగబా నడిచి ఆ ఇద్దరి మధ్యకీ వెళ్ళింది.

అకస్మాత్తుగా వారి దగ్గరికి వచ్చిన మూడో వ్యక్తిని చూడగానే అంత వరకూ అరుస్తున్న స్త్రీ బ్రతిమాలుతున్న పురుషుడూ తొట్రు పాటుగా కదిలి "ఎవరదీ?" అన్నారు ఒకే సారిగా.

"చూడండీ!" అంటున్న స్వప్న మాటలు అక్కడితోటే ఎవరో పీక నులిమినట్లు ఆగిపోయాయి. స్త్రీ "ఎవరు నువ్వు? ఏం కావాలి?" అనడం, ఆ పురుషుడు స్వప్న చెంప చెళ్ళుమనిపించడం ఒకేసారి జరిగాయి.

"మీరా! ఎవరో అనుకున్నాను" అన్న మాటల్ని పైకి రానీకుండానే పీకపట్టుకుని పిచ్చి కోపంతో పిసకగానే గుడ్లు తేలేసి నేలకొరిగి పడిపోయిన స్వప్నని బూటుకాలితో ఒక్క తన్ను తన్ని "హు" అనుకుంటూ చకచకా అక్కడినుంచి వెళ్ళిపోయాడు భరత్, అప్పటికే అలిగి వెళ్ళిపోతున్న ఆ ఆడపులి వెంట పిల్లిలా.

– వనితాజ్యోతి, డిశంబరు 1991